సునీత కేజ్రీవాల్‌కు ఆప్ ప్రచార బాధ్యతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచార బాధ్యతలను ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ తీసుకున్నారు. కేజ్రీవాల్ జైలులో ఉన్నందున ఆయన తరపున ప్రజల్లోకి వెళ్లాలని సునీత నిర్ణయించారు. శనివారం ఆమె తూర్పు ఢిల్లీ లోక్‌సభ స్థానంలో రోడ్‌షో నిర్వహించారు. ఢిల్లీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తున్న పంజాబ్, గుజరాత్, హర్యానాల్లో పార్టీ అభ్యర్థుల తరపున సునీత రోడ్‌షోలు నిర్వహిస్తారని ఢిల్లీ మంత్రి ఆతిశి తెలిపారు. మరోవైపు ఎన్నికల కోసం ఆప్ ప్రధాన కార్యాలయంలో వార్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం 'జైల్ కా జవాబ్ వోట్ సే' నినాదంతో ఆప్ కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది.

కాంగ్రెస్‌ను ముస్లింలు నమ్మడం లేదు

- మహారాష్ట్ర సీనియర్ నేత ఆరిఫ్
- రాష్ట్రంలో ముస్లింలకు ఒక్క సీటూ కేటాయించని ఎంవీఏ కూటమి

ముంబై: కాంగ్రెస్ పార్టీలో ముస్లింలకు టికెట్ల కేటాయింపులో మొండి చెయ్యి చూపడంపై అసంతృప్తి మొదలైంది. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడీ ఒక్క సీటును కూడా ముస్లింలకు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మహమ్మద్ ఆరిఫ్ ఖాన్(నసీం) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు ఘాటు లేఖ రాశారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ తమకు ఒక్క సీటైనా ఇస్తుందని ముస్లింలు నమ్మారు. ఒక్క సీటు కూడా ఇవ్వక పోవడంతో నమ్మకం పోయింది. ముస్లింల ఓట్లు కావాలి కానీ ముస్లింలకు టికెట్లు ఇవ్వదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. వారికి జవాబు చెప్పలేను. పార్టీకి ప్రచారం చేయలేను. స్టార్ క్యాంపెయినర్ పదవి నుంచి తప్పుకుంటున్నాను.' అని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేస్తుండగా ఒక్కటీ ముస్లింలకు కేటాయించలేదు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తున్న శివసేన(యూబీటీ), ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్) ముస్లింలకు సీట్లు ఇవ్వకపోవడంతో ముస్లిం నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

రాజకీయాల్లోకి రావాలని దేశం పిలుస్తున్నది: వాద్రా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా తన రాజకీయ రంగ ప్రవేశంపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమేథీ నుంచి పోటీ చేస్తారా? అని ఓ విలేకరి శనివారం అడిగినపుడు ఆయన బదులిస్తూ, తాను క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించడానికి దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో మద్దతు ఉందన్నారు. తాను ఎల్లప్పుడూ ప్రజల మధ్యలోనే ఉంటున్నానని చెప్పారు. తాను అక్కడ (అమేథీలో) 1999 నుంచి ప్రచారం చేస్తున్నానని, ఆ ప్రాంతంలో తాను ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, అమేథీ ఎంపీ స్మృతి ఇరానీపై వాద్రా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆమె ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు.

అసలు సోనియా, ఇందిరాలకు మంగళసూత్రాలున్నాయా?

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

బెగుసరాయ్: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. త్యాగాలు చేయడానికి అసలు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, కాంగ్రెస్ నేత సోనియా గాంధీలకు మంగళసూత్రాలు ఉన్నాయా? అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల మంగళసూత్రాలు, బంగారాన్ని గుంజుకుపోతుందని ప్రధాని మోదీ చేసిన విమర్శలపై కాంగ్రెస్ నేత ప్రియాంక స్పందిస్తూ.. తన తండ్రి రాజీవ్ గాంధీని కోల్పోవడం ద్వారా తన తల్లి సోనియా మంగళ సూత్రాన్ని త్యాగం చేశారని, తన నానమ్మ ఇందిరా గాంధీ కూడా ప్రాణాలను అంకితం చేశారన్నారు. ప్రియాంక వ్యాఖ్యలపై గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ 'ఇటలీ నుంచి వచ్చిన సోనియాకు మంగళసూత్రం ఉంటుందో లేదో నాకే తెలియదు. అలాగే ఇందిరా గాంధీని పెళ్లాడిన ఫిరోజ్ గాంధీ పార్సీ మతస్తుడు' అని వ్యాఖ్యలు చేశారు.

యూపీలో కమలం | ఎదురీత?!

పేపర్ల లీక్ వల్ల యోగి సర్కారుపై నిరుద్యోగులు గరం

- రాజ్‌పుత్‌లదీ అదే బాట..ద్రవ్యోల్బణంపై పేదల్లో కోపం
- రెండు దశల్లోనూ బీజేపీకి వ్యతిరేకంగా ఓటింగ్!
- ఎన్నికల వేళ బీజేపీ–ఆర్ఎల్డీ కూటమిలో విభేదాలు
- కమలం పార్టీకి చారిత్రక పరాజయం ఖాయం: అఖిలేశ్

లక్నో, ఏప్రిల్ 27: కేంద్రంలో అధికారం పొందేందుకు కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో కమలానికి ఎదురీత తప్పేలా లేదని విశ్లేషకులు అంటున్నారు. రెండో విడత ఎన్నికల తర్వాత మొత్తం 80 సీట్లున్న యూపీలో బీజేపీ ఎదురుగాలి స్పష్టంగా కన్పించింది. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై యువ ఓటర్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ధరల పెరుగుదలకు కేంద్రంలోని బీజేపీనే కారణమని చాలా మంది పేదలు నమ్ముతున్నారు! మరోవైపు రైతుల ఉద్యమం తదితర కారణాల వల్ల రాజ్‌పుత్‌ల లోనూ కమలనాథుల పట్ల ఆగ్రహం నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో కమలనాథులకు నిరాశ తప్పకపోవచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇటీవల జరిగిన ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్లు లీక్ కావడం రాష్ట్రంలోని యువ నిరుద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురి చేసింది. రాష్ట్రంలోని పేదలతో పాటు రాజ్‌పుత్ వర్గాలు కమలం పాలనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఎస్పీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయగా, ఆర్ఎల్డీ, బీజేపీ భాగస్వామిగా ఉన్నాయి. బీఎస్పీ ఒంటరిగానే బరిలోకి దిగింది. మొదటి విడతలో మాదిరిగానే రెండో విడత ఎన్నికల్లో సైతం రాజ్‌పుత్ వర్గాలు అధికార బీజేపీపై తమ ఆగ్రహాన్ని ప్రదర్శించినట్లు భావిస్తున్నారు. రెండో విడత ఎన్నికలో మూడు స్థానాల్లో వీరి ప్రాబల్యం గణనీయంగా ఉంది. బీజేపీపై రాజ్‌పుత్‌లు బహిరంగంగానే వ్యక్తం చేస్తున్న కోపాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఇండియా కూటమి, బీఎస్పీలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.

బీజేపీ కూటమికి అగ్ని పరీక్ష

ఈ ఎన్నికలు బీజేపీ–ఆర్ఎల్డీ కూటమికి అగ్ని పరీక్ష అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా భాగ్‌పట్, మథుర, అలీగఢ్ నియోజకవర్గాల్లో ఇరు వర్గాల మధ్య ఎలాంటి పొత్తు ఉన్న లక్షణాలు కన్పించడం లేదని వారు పేర్కొంటున్నారు. అక్కడ అవి ఎడమొహం, పెడమొహం గానే ఉన్నాయని, ఈ రెండు పార్టీల మధ్య ఇటీవల జరిగిన సమావేశాల్లో పార్టీ కార్యకర్తల మధ్య విభేదాలు ప్రస్ఫుటంగా కన్పించాయని అంటున్నారు.

'మిగతా దశల్లో బీజేపీ మరింత బలహీనం'

యూపీలో బీజేపీ చారిత్రక ఓటమిని చవిచూడబోతున్నదని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ జోస్యం చెప్పారు. రెండో విడత తర్వాత బీజేపీ ఖేల్ ఖతం అన్న విషయం స్పష్టమైందన్నారు. రెండో విడత పోలింగ్ అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం జరిగిన పోలింగ్‌లో ఒక వింత ధోరణిని పరిశీలించానని తెలిపారు. ఇండియా కూటమికి అనుకూలంగా ఓటు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, అదే సమయంలో బీజేపీ ఓటింగ్ శాతంలో తగ్గుదల కన్పించిందని చెప్పారు. వచ్చే ఐదు దశల ఎన్నికల్లో ఆ పార్టీ మరింత బలహీన పడుతుందని చెప్పారు.

యూపీలో రాజకీయ భూకంపం: యోగేంద్ర

ఈసారి యూపీలో రాజకీయ భూకంపం సంభవించబోతున్నదని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. 15 పార్లమెంట్ స్థానాల్లోని గ్రామీణ ఓటర్లలో బీజేపీ పట్ల వ్యతిరేకత వ్యక్తమైందన్నారు.

యోగేంద్ర సర్వే అంచనాలు

- ఈసారి బీజేపీ ఇక్కడ 70 సీట్ల సంగతి మర్చిపోవచ్చు. 50 సీట్లు కూడా పార్టీకి దక్కకపోవచ్చు.
- బీజేపీ ఎంపీలు, స్థానిక నేతల పట్ల ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇక్కడ అతి పెద్ద సమస్యలు. పశువుల సమస్య ఎక్కువగా ఉంది.
- మూడోసారి బీజేపీకి అధికారం ఇస్తే నియంతృత్వం ప్రారంభమవుతుంది. అందుకే ఈసారి మార్పు కావాలనుకుంటున్నాం.
- నాలుగో వంతు మంది బీజేపీ ఓటర్లు ఈసారి ఆ పార్టీకి ఓటేయమని చెబుతున్నారు.
- ఇప్పుడు మోదీని చూసి ఓట్లేసే పరిస్థితి లేదు.

ఒక్క రూపాయైనా స్వాధీనం చేసుకున్నారా?

- ఈడీ నాతో దురుసుగా ప్రవర్తించింది
- మద్యం కేసు రిజాయిండర్‌లో కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినా, గోవా ఎన్నికలకు నిధులు ఖర్చు చేసినట్టు రుజువులు, ధ్రువీకరణ లేకపోయినా, ఒక్క రూపాయి కూడా స్వాధీనం చేసుకోకపోయినా ఈడీ తనను అరెస్ట్ చేసిందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ కేసులో ఈడీ తనతో చాలా దురుసుగా వ్యవహరించిందని శనివారం సుప్రీంకోర్టుకు తెలిపారు. తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈడీ రిపై అఫిడవిట్‌కు కేజ్రీవాల్ సమాధానాన్ని దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు తనను అరెస్ట్ చేయడం చూస్తే ఈడీ ఏకపక్ష ధోరణి అర్థమవుతుందన్నారు. మరోవైపు కేజ్రీవాల్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని ఎయిమ్స్ వైద్యుల మెడికల్ బోర్డు నివేదిక ఇచ్చింది.

ఓటింగ్ 'మెరవాలని'..!

లోక్‌సభ ఎన్నికలపై అవగాహన పెంచడానికి, ఓటింగ్ శాతం పెంచడానికి ఎన్నికల సంఘం వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. ఢిల్లీలోని ప్రఖ్యాత చారిత్రక కట్టడం 'కుతుబ్ మినార్'పై త్రివర్ణ పతాకం, పార్లమెంట్ భవనం, ఎన్నికల సంఘం లోగోతోపాటు ఎన్నికలకు సంబంధించిన అంశాలను విద్యుత్తు వెలుగుల్లో ఇలా ప్రదర్శించింది.

హెలికాప్టర్‌లో జారిపడ్డ మమత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి చిన్న ప్రమాదం జరిగింది. శనివారం ఆమె హెలికాప్టర్‌లోకి ఎక్కి కూర్చోబోతుండగా పట్టు తప్పి కింద పడ్డారు. భద్రతా సిబ్బంది ఆమెకు సహాయం చేశారు. తర్వాత ఆమె తన ప్రయాణాన్ని కొనసాగించారు. దుర్గాపూర్ నుంచి అసనోల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

మణిపూర్‌లో దుండగుల కాల్పులు

ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మృతి

ఇంఫాల్, ఏప్రిల్ 27: మణిపూర్‌లో తాజాగా మరోసారి హింస రేగింది. బిష్ణుపూర్ జిల్లాలో ఒక వర్గానికి చెందిన ఉగ్రవాదులుగా భావిస్తున్న కొంతమంది విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శనివారం అర్ధరాత్రి నరన్‌సేనలోని భద్రతా బలగాల్ని లక్ష్యంగా చేసుకొని జరిగిన ఈ కాల్పుల్లో దాడిలో ఒక ఎస్ఐ, ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్ మరణించారు. ఒక ఇన్‌స్పెక్టర్, మరో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఎత్తయిన కొండలపై నుంచి దుండగులు భద్రతా దళాల క్యాంప్‌పై రెండు గంటలపాటు కాల్పులకు తెగబడ్డారని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు చెప్పారు.

మన సొత్తుపై | కాంగ్రెస్, బీజేపీ కన్ను!

- వారసత్వ పన్ను న్యాయమేనన్న శామ్ పిట్రోడా
- 2017లో వారసత్వ పన్ను విధింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన కమలనాథులు
- విమర్శలు రావడంతో రహస్యంగా యూటర్న్

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, దేశ ప్రజల సొత్తును స్వాధీనం చేసుకొంటుందా?' అంటూ నిన్న మొన్నటివరకూ భయపడ్డాం. అయితే, బీజేపీ సర్కారు అధికారంలో కొనసాగినా మన సొత్తు మనకు ఉండకపోవచ్చు. ఎందుకంటారా? వారసత్వ పన్ను విధించాలని మోదీ సర్కారు ఏకంగా చట్ట సవరణలకు సిద్ధపడటమే దీనికి కారణం. అంటే.. కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. చెమటోడ్చి సంపాదించిన మన సొమ్ముకు గ్యారెంటీ లేదన్న మాట!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశంలో వారసత్వ పన్ను ఉండాలని, మరణించిన వారి ఆస్తుల్లో 55% వాటాను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత, గాంధీల కుటుంబానికి సన్నిహితుడు శామ్ పిట్రోడా ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. వారసత్వ పన్ను తనకు న్యాయంగానే కనిపిస్తున్నదన్న ఆయన.. అమెరికాలో ఉన్నట్టే భారత్‌లోనూ ఈ విధానాన్ని తీసుకురావాలన్నారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కష్టపడి సంపాదించిన సొమ్మంతా ఎక్కడ ఎత్తుకుపోతారోనని సామాన్యులు భయపడ్డారు. ఇక, పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధానమంత్రి మోదీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'వారసత్వ పన్ను'ను ఇప్పుడు వ్యతిరేకిస్తున్న ప్రధాని మోదీ.. 2017లో గుట్టుచప్పుడు కాకుండా ఈ పన్నును యావత్తు దేశ ప్రజలపై రుద్దాలనుకొన్నారు. ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు.

చట్టంలో సవరణకు ప్రయత్నాలు..

మరణించిన వ్యక్తి నుంచి వారసత్వంగా వచ్చిన సొమ్ముపై విధించే పన్నును వారసత్వ పన్ను లేదా ఎస్టేట్ పన్నుగా పిలుస్తారు. గతంలో భారత్‌లోనూ ఈ విధానం ఉండేది. అయితే, ఈ పన్ను ద్వారా ఆర్థిక అసమానతల్లో తగ్గుదల ఏమీ లేదని గ్రహించిన అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం1985లో రద్దు చేసింది. అమెరికా, యూకేల్లో వారసత్వ పన్ను కొనసాగుతున్నట్టే, భారత్‌లోనూ ఈ తరహా పన్నును విధిస్తే బాగుంటుందని 2017లో మోదీ ప్రభుత్వం యోచించింది. రూ.50 వేల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు, సొమ్ము వారసత్వంగా సంక్రమించినట్లైతే, ఆ సొత్తును 'ఇతర మార్గాల ద్వారా లభించిన ఆదాయం' కింద పరిగణించాలని భావించింది. దీనిపై వారసత్వ పన్ను విధించాలని అప్పటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించారు. ఈ మేరకు చట్టంలో సవరణలు, ఇతరత్రా మార్గదర్శకాల కోసం మోదీ ప్రభుత్వం విధివిధానాలను కూడా రూపొందించింది. అయితే, సైరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ వంటి న్యాయసలహా సంస్థలు, జితేంద్ర సోలంకీ వంటి ఆర్థిక నిపుణులు, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టిషనర్స్, హక్కుల కార్యకర్తలు, మేధావులు బీజేపీ సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. 'వారసత్వ పన్ను' ఆలోచనను విరమించుకోవాలని, లేకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో మోదీ సర్కారు ఆ యోచనను విరమించుకొన్నది. కాగా తమ పార్టీ ప్రభుత్వం రద్దు చేసిన 'వారసత్వ పన్ను'ను తీసుకొస్తామంటూ కాంగ్రెస్ ఇప్పుడు చెప్పడం చిత్రమైన విషయం. 'వారసత్వ పన్ను'ను గతంలో రహస్యంగా తీసుకురావాలని యోచించి ఆ తర్వాత భంగపడ్డ బీజేపీ.. ఇప్పుడు అదే అంశంపై అంతెత్తున ఎగురుతుండటం ఇంకా విచిత్రమనే విమర్శలు పెద్దయెత్తున వస్తున్నాయి.

వర్షాలు పడితేనే ధరల్లో తగ్గుదల!

న్యూఢిల్లీ: వర్షాలు పడితేనే ధరలు తగ్గుతాయని కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేసింది. నెలవారీ సమీక్షలో భాగంగా నిత్యావసర వస్తువుల ధరలను ఆ శాఖ పరిశీలించింది. ఈసారి వర్షాకాలంలో వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పిందన్నారు. ఫిబ్రవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 8.7 శాతంకాగా, మార్చిలో ఇది 8.5 శాతానికి తగ్గిందని చెప్పింది. మరోవైపు పప్పుధాన్యాల ధరలను నియంత్రించేందుకు బ్రెజిల్ నుంచి 20 వేల టన్నుల పెసరపప్పు, అర్జెంటినా నుంచి కందులు దిగుమతి చేసుకొనేందుకు కేంద్రం జరుపుతున్న చర్చలు తుది దశకు వచ్చాయి. మొజాంబిక్, టాంజానియా, మయన్మార్‌ల నుంచి పప్పుల దిగుమతికి కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది.

ముంబైలో బీజేపీ అభ్యర్థి మార్పు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థిని బీజేపీ శనివారం మార్చింది. సిటింగ్ ఎంపీ పూనమ్ మహాజన్‌ను మొదట ఈ స్థానం నుంచి నిలిపినప్పటికీ, ఆమెకు బదులుగా ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌కు టికెట్ ఇచ్చింది. పూనమ్ 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు.

ఫ్రాంక్ టైసన్‌ను కింద పడేసి మోకాలితో తొక్కుతున్న పోలీసులు

కింద పడేసి.. మోకాలితో తొక్కి

అమెరికాలో మరో నల్లజాతీయుడిపై దాష్టీకం

అపస్మారక స్థితిలోకి వెళ్లి బాధితుడి మృతి

వాషింగ్టన్, ఏప్రిల్ 27: అమెరికాలో పోలీసులు మరోసారి దాష్టీకానికి పాల్పడ్డారు. 2020లో చోటుచేసుకొన్న 'జార్జి ఫ్లాయిడ్' తరహాలోనే తాజాగా మరో దురాగతానికి ఒడిగట్టారు. ఫ్రాంక్ టైసన్(53) అనే ఓ నల్లజాతీయుడిని కింద పడేసి.. మెడపై మోకాలితో గట్టిగా నొక్కిపెట్టి, ఊపిరాడకుండా చేసి అతని ప్రాణాలు తీశారు. 'నాకు ఊపిరి ఆడటం లేదు' అని బాధితుడు మొత్తుకున్నా పోలీసులు వదిలిపెట్టకుండా కర్కశంగా వ్యవహరించారు. ఓహియో రాష్ట్రంలోని కాంటన్ నగరంలో వారం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ప్రపంచాన్ని మరోసారి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన బాడీ కెమెరా ఫుటేజ్‌ను కాంటన్ పోలీసు విభాగం గురువారం విడుదల చేసింది. టైసన్ పట్ల దారుణంగా వ్యవహరించిన పోలీసు అధికారులను బ్యూ స్కోనెగ్ట్, కామ్డెన్ బుర్చ్‌గా గుర్తించారు.

చేతులకు సంకెళ్లు వేసి కర్కశం

ఈ నెల 18న ఓ కారు ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టిన ఘటన జరిగింది. ఆ సమయంలో కారులో ఉన్న టైసన్‌ను సమీపంలోని ఓ బార్‌లోకి వెళ్లినట్లు పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అనుమానించి అక్కడికి వెళ్లారు. వీడియో ఫుటేజ్ ప్రకారం టైసన్‌ను పట్టుకొన్న పోలీసులు అతని చేతులకు సంకెళ్లు వేసి, కింద పడేశారు. పోలీసు అధికారుల్లో ఒకరు టైసన్ మెడ సమీపంలోని వెనుక భాగంలో మోకాలు వేసి గట్టిగా నొక్కి పెట్టి 'ఇప్పుడు బాగుందా!' అంటూ వికృత ఆనందం పొందారు. ఆ తర్వాత కొంత సేపటికి టైసన్ చలనం లేకుండా పడిపోయాడు. దీంతో దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు.

గతంలో కూడా ఇదేవిధంగా..

2020లో కూడా ఇదే విధంగా పోలీసుల కర్కశత్వానికి జార్జిఫ్లాయిడ్ బలైన విషయం తెలిసిందే. ఆఫ్రో అమెరికన్ అయిన జార్జి ఫ్లాయిడ్ మెడపై డెరెక్ చౌవిన్ అనే పోలీసు అధికారి దాదాపు తొమ్మిది నిమిషాలకు పైగా మోకాలితో తొక్కి పెట్టాడు. దీంతో అతను ఊపిరాడక మృతిచెందాడు.

'పనిలో థ్రిల్ తప్ప అన్నీ మారాయి'

శాన్ ఫ్రాన్సిస్కో: గూగుల్‌లో అన్నీ మారాయని, పని చేయడంలో లభించే థ్రిల్(పులకరింత) మాత్రం మారలేదని ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. గూగుల్‌లో తాను ఉద్యోగంలో చేరి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో తన సంతోషాన్ని ఆయన పంచుకున్నారు. ''నేను 2004 ఏప్రిల్ 26న గూగుల్‌లో అడుగు పెట్టాను. అప్పటి నుంచి చాలా మార్పులు వచ్చాయి. సాంకేతికత, మా ఉత్పత్తులను ఉపయోగించేవారి సంఖ్య వంటివెన్నో మారాయి. కానీ మారనిది – ఈ అద్భుతమైన కంపెనీలో పని చేయడం ద్వారా నేను పొందే థ్రిల్. 20 ఏళ్ల గడిచాయి. నేను ఇప్పటికీ అదృష్టవంతుడిగానే భావిస్తున్నాను'' అని తెలిపారు. కొద్ది గంటల్లోనే ఆయన పోస్టుకు 1,32,400 లైక్‌లు వచ్చాయి.

హైదరాబాద్ వాసికి 16 ఏండ్ల జైలు

లండన్, ఏప్రిల్ 27: మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను కత్తితో దారుణంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన 23 ఏండ్ల హైదరాబాద్ వాసి శ్రీరామ్ అంబాలాకు లండన్ న్యాయస్థానం 16 ఏండ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పింది. లండన్‌లోని హైదరాబాద్ వాలా రెస్టారెంట్‌లో పనిచేస్తున్న కేరళకు చెందిన 23 ఏండ్ల సోనా అనే మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను 2022, మే 5న నిందితుడు అందరూ చూస్తుండగా దాడి చేసి కత్తితో 9 పోట్లు పొడిచాడు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం ముగ్గురు భారతీయుల మృతి

న్యూయార్క్: అమెరికాలోని సౌత్ కరోలినాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నలుగురు భారతీయులు ప్రయాణిస్తున్న కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందిన రేఖాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మనీశాబెన్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు కాగా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. గ్రీన్‌విల్లే కౌంటీలోని ఓ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు పరిమితికి మించిన వేగంతో కారు ప్రయాణిస్తున్నదని పోలీసులు భావిస్తున్నారు. కారు అదుపు తప్పి 20 అడుగుల ఎత్తుకు ఎగిరిందని, రోడ్డు పక్క చెట్లపై ఇరుక్కుందని పోలీసులు తెలిపారు.

చర్మ క్యాన్సర్‌కు టీకా!

- మెలనోమా మళ్లీ ఉత్పన్నం కాకుండా అడ్డుకునేలా అభివృద్ధి
- రెండో దశ క్లినికల్ ట్రయల్స్‌లో మెరుగైన ఫలితాలు
- త్వరలో మూడో దశ

లండన్, ఏప్రిల్ 27: చర్మ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక ముందడుగు పడింది. మెలనోమా(ఒక రకమైన చర్మ క్యాన్సర్) తిరగబడకుండా నిరోధించే టీకా త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మోడెర్నా, ఎంఎస్‌డీ అనే ఫార్మా కంపెనీలు ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశాయి. పలు కొవిడ్ వ్యాక్సిన్‌లలో ఉపయోగించిన ఎంఆర్ఎన్ఏ ఆధారిత టెక్నాలజీతో ఈ వ్యాక్సిన్‌ను తయారు చేశారు. దీనిని ఎంఆర్ఎన్ఏ-4157(వీ940)గా పిలుస్తున్నారు. ఇప్పటికే ఈ వ్యాక్సిన్‌కు సంబంధించిన రెండో దశ ట్రయల్స్ విజయవంతమయ్యాయి. మెలనోమా బాధితుల్లో మళ్లీ క్యాన్సర్ తిరగబడే ముప్పును సగం వరకు తగ్గించిందని తేలింది. ఇప్పుడు యూనివర్సిటీ కాలేజ్ లండన్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు మూడో దశ క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1,100 మందిపై క్లినికల్ ట్రయల్స్ జరగనున్నాయి.

తొమ్మిది డోసుల వ్యాక్సిన్

ఈ వ్యాక్సిన్‌ను మూడు వారాలకు ఒక డోస్ చొప్పున తొమ్మిది డోసులు ఇస్తారు. వ్యాక్సిన్‌తో పాటు కీత్రుడా అనే మరో ఔషధాన్ని ఇస్తారు. మెలనోమా బారిన పడ్డ వారికి సర్జరీ చేసి తొలగించిన కణతుల నుంచి నమూనాను సేకరించి, ఏఐ ద్వారా డీఎన్ఏ సీక్వెన్సింగ్ చేసి ఆ రోగి అవసరానికి తగ్గట్టుగా వ్యాక్సిన్‌ను తయారుచేస్తారు. తద్వారా ఈ వ్యాక్సిన్ శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను క్యాన్సర్ కణాలను వెంటనే గుర్తించి, వాటిని నాశనం చేసేలా సిద్ధం చేస్తుందని, మెలనోమా మళ్లీ తిరగబడకుండా చూస్తుందని యూసీఎల్‌హెచ్ ఆంకాలజిస్ట్ హెథెర్ షా తెలిపారు.

పీవోకేలో చైనా దురాగతం

సియాచిన్ సమీపంలో రోడ్డు నిర్మాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: డ్రాగన్ దేశం చైనా కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లోని షాక్స్‌గామ్ లోయ ప్రాంతంలో యథేచ్ఛగా రోడ్డు నిర్మాణాలు చేపట్టింది. దీనికి సంబంధించి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ శాటిలైట్ చిత్రాలు తాజాగా వెలుగులోకి రావడంతో చైనా దురాగతం బయటపడింది. భారత్‌కు అత్యంత కీలకమైన సియాచిన్ గ్లేసియర్‌కు సమీపంలో చైనా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం గమనార్హం. 2022, జూలై–2023,